క్లుప్తంగా

నేడు మంత్రి పెద్దిరెడ్డి ప్రచారం


మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలంలోని 19 గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రచారం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, మండల పార్టీ కన్వీనర్ అంజిబాబు తెలిపారు. ఉదయం 7 గంటలకు అంకుతోటపల్లెలో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రారంభిస్తారన్నారు. ఏ.కొత్తకోట, దుర్గసముద్రం, చారాల, శెట్టిపేట, పందిళ్లపల్లె, ఆమినిగుంట, పరికిదొన, గడ్డంవారిపల్లె, పెద్దకొండామర్రి, వెంగళపల్లె, దిగువపల్లె, కాగతి, కాటిపేరి, లద్దిగం, పచింతమాకులపల్లె, కొండయ్యగారిపల్లె, పెద్దయల్లకుంట్ల, చౌడేపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సివిల్ కోర్టు జడ్జి బదిలీ


న్యాయమూర్తి వాసుదేవరావు

పుంగనూరు: పట్టణంలోని సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.వాసుదేవరావును విశాఖపట్నం మెట్రోపాలిటిన్ కోర్టుకు బదిలీ చేశారు. శనివారం రాష్ట్ర హైకోర్టు 39 మంది న్యాయమూర్తులను రాష్ట్ర వ్యాప్తంగా బదిలీ చేసింది. ఇందులో భాగంగా న్యాయమూర్తి వాసుదేవరావును విశాఖకు బదిలీ చేశారు.

ముత్తుకూరులో ఫ్యామిలీ డాక్టర్


లింగాపురంలో వైద్యపరీక్షలు

పెద్దపంజాణి: ముత్తుకూరు, లింగాపురం గ్రామాల్లో శనివారం పెద్దపంజాణి ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.మురళి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో 123 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఏఎన్ఎంలు భారతి, రెడ్డెమ్మ, ఆశావర్కర్ శశికళ పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

- రూ 50 వేల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దపంజాణి: గడ్డివామి దగ్ధమై రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన చిలకపుత్తూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. చిలకపుత్తూరుకు చెందిన తోటి అంజప్ప కార్పెంటర్ పనిచేసుకుంటూ పశువులను పోషించుకుంటున్నాడు. ఇటీవలే పశువుల మేత కోసం మూడు ట్రాక్టర్ల వరిగడ్డిని కొనుగోలుచేసి ఇంటి ముందు వేశాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం గడ్డివామిలో మంటలు చెలరేగాయి. విషయం తెలిసి పలమనేరు అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేసేలోపు గడ్డివామి పూర్తిగా కాలి బూడిదైంది. ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

నాటు సారా బట్టీలు ధ్వంసం


కౌండిన్య అడవిలో నాటు సారా బట్టీలు

పలమనేరు: పలమనేరు, బైరెడ్డిపల్లి మండలాల సరిహద్దుల్లోని చెత్తపెంట, బాపలనాత్తం, నెల్లిపట్ల అటవీ ప్రాంతాల్లో శనివారం స్థానిక ఐడీ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించి నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. ఎన్నికల నేపథ్యంలో కౌండిన్య అడవిలో తమిళనాడు ముఠాలు జోరుగా నాటుసారాను తయారుచేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అడవిలోకి వెళ్లి నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. కాగా అక్కడ నాటుసారా తయారు చేస్తున్న పదిమందిలో ఒక్కరిని కూడా పోలీసులు పట్టుకోకపోవడం కొసమెరుపు. ముందుగానే స్మగ్లర్లకు ఈ సోదాలపై సమాచారం అందడంతోనే తమిళనాడు స్మగ్లర్లు తప్పించుకున్నట్లు సమాచారం.

జగన్ వస్తేనే సంక్షేమ ఫలాలు

- పేద ప్రజలకు కష్టాలు తప్పవు
- ఎంపీ, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ

పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లేకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని, పేద ప్రజలకు కష్టాలు తప్పవని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ, ఎస్సీ కమిషన్ మెంబర్ ఆనంద్‌ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని చంద్రమాకులపల్లె, ఏతూరు, పాలెంపల్లి, చదళ్ల, బండ్లపల్లి గ్రామాల్లో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధం ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. మంత్రితో పాటు ప్రచారంలో వీరు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయాలు నెరవేర్చారు...



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలతో డాక్టర్ అంబేడ్కర్, పూలే ఆశయాలు నెరవేరాయని వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ, ఎస్సీ కమిషన్ మెంబర్ ఆనంద్‌ప్రకాష్ కొనియాడారు. దళిత పిల్లలకు విద్యను అందించడం, ఆర్థిక సాయం రుచికరమైన భోజనం అందించడంతో దళితులు విద్యపై మొగ్గుచూపుతున్నారన్నారు. విద్యను సాధిస్తే దళితుల అభివృద్ధి జరిగినట్లేనని, ఇలాంటి ఉన్నత కార్యక్రమాన్ని అమలు చేస్తున్న జగన్‌కు దళితులందరు అండగా నిలిచి , రెండవ సారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే అధోగతేనని, సంక్షేమం ఆగిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. –ఆనంద్‌ప్రకాష్, వైఎస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ, ఎస్సీ కమిషన్ మెంబర్

బడుగుల జీవితాల్లో మార్పులు



సమాజంలోని ప్రతి ఒక్కరికి మేలు జరగాలన్న ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు బడుగుల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చాయని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. సామాన్య కుటుంబంలో జన్మించిన తనకు రెండవ సారి ఎంపీ టికెట్ ఇవ్వడం మరువలేనిదన్నారు. బడుగుబలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లేకుంటే సంక్షేమ పథకాలు ఊసే ఉండదన్నారు. చంద్రబాబు మాయమాటలకు తగిన గుణపాఠం నేర్పాలని, ఉమ్మడి పార్టీలతో ముప్పు తప్పదనే విషయం ప్రజలందరూ గమనించాలని కోరారు. – ఎస్.రెడ్డెప్ప, ఎంపీ, చిత్తూరు

జగన్‌తోనే సంక్షేమం



పేద ప్రజల సంక్షేమం కోసం నవరత్నాలను ప్రవేశపెట్టి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లేకుంటే సంక్షేమ పథకాలు అధోగతి పాలవుతాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లు 1వ తేదీ ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకోవడంతో బ్రేక్ పడిందన్నారు. సచివాలయాలలో పంపిణీ చేయడంతో అవ్వాతాతలు అక్కడికి వెళ్లలేక 33 మంది మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలందరు జాగ్రత్తగా రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. – శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ దంపతులు



మసీదులో దువా చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, సుబ్రమణ్యంరెడ్డి, దుర్గ

రామకుప్పం: మండలంలోని విజలాపురం మసీదులో శనివారం వైఎస్సార్‌సీపీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్, జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అదేవిధంగా మహిళల ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ పాల్గొని మహిళలతో కలిసి దువా చేశారు. అంతకుముందు మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రామగౌడు, మైనారిటీ నేతలు తన్వీద్, నయాజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి


మాట్లాడుతున్న యండపల్లి శ్రీనివాసులురెడ్డి

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషిచేద్దామని మాజీ ఎంఎల్‌సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళంపేటలో రిటైర్డ్ ఉపాధ్యాయులతో శనివారం ఆయన మాట్లాడారు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎర్రయ్య, రామకృష్ణ, రవీంద్రనాథరెడ్డి, పురుషోత్తం రెడ్డి, మునిరత్నం పాల్గొన్నారు.

రూ.16.5 లక్షల నగదు పట్టివేత

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లై ఓవర్ వద్ద స్థానిక పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఓ కారులో రూ.16.5 లక్షల నగదును పట్టుకున్నారు. దీనిపై విచారించగా తాను పట్టణానికే చెందిన వ్యాపారి అని ఆ డబ్బుకు సంబంధించిన బిల్లులు, తన ఆధార్, డబ్బులిచ్చిన వారి రసీదులను చూపెట్టాడు. అన్నీ సక్రమంగానే ఉండడంతో ఆ నగదును వెనక్కిచ్చేసినట్టు డీటీ రుషి, ఎస్ఐ సహదేవి తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే దళితుల అభ్యున్నతి


చౌడేపల్లెలో మీడియాతో మాట్లాడుతున్న చెల్లెం ఆనంద్‌ప్రకాష్

- జగన్ ప్రభుత్వంలోనే మా బతుకులు మారాయి
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డికే దళితుల మద్దతు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌ప్రకాష్

చౌడేపల్లె: రాష్ట్రంలోని దళితులు, బీసీ, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాలతోనే జరిగిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లెం ఆనంద్‌ప్రకాష్ తెలిపారు. ఆదివారం దృశ్య కళల అకాడమీ రాష్ట్ర డైరక్టర్ అంజిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం మధు, జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామితో కలిసి మీడియాతో మాట్లాడారు. దళితుల సంక్షేమం, అభ్యున్నతి కోసం జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేయడంతోపాటు రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. దళితులకు డిప్యూటీ సీఎంలు, మరిన్నో నామినేటెడ్ పోస్టులను కేటాయించి అంబేడ్కర్ కలలుగన్న పాలనను అమలుచేస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి ప్రభుత్వానికి దళితులు ఎప్పుడూ మద్దతిస్తారని అన్నారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ రావాలని ఆకాంక్షిస్తూ పుంగనూరు నియోజకవర్గంలోని దళిత వాడల్లో ప్రచారం నిర్వహిస్తూ జగనన్నకు, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు మద్దతుగా నిలిచామని తెలిపారు. గత ప్రభుత్వాలు దళితులను విస్మరిస్తే జగనన్న ప్రభుత్వంలో రూ.62 వేల కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డిలకు అత్యధిక మెజార్టీ కానుకగా ఇద్దామంటూ పిలుపునిచ్చారు. బోయకొండ కమిటీ మాజీ డైరెక్టర్ శంకరప్ప, జిల్లా ఎస్సీ సెల్ డైరెక్టర్ సురేంద్ర, డీసీసీబీ మాజీ బ్యాంక్ మేనేజర్ రెడ్డెప్ప, డిష్ సూరి, కూరపర్తి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



రామకుప్పం: అక్రమంగా రవాణా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆరిమానుపెంట గ్రామానికి చెందిన లోకేష్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకెళ్తుండగా ఆరిమానుపెంట గ్రామ సమీపంలో అతని నుంచి 358 టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని అతని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.35 వేలు ఉంటుందని ఎస్ఐ అన్నారు.

వలంటీర్లకు అండగా ఉంటా


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- మళ్లీ అధికారంలోకి వస్తే మీరే వలంటీర్లు
- ఎమ్మెల్సీ భరత్

కుప్పం: చంద్రబాబు ఫిర్యాదుతో ఈసీ తొలగించిన వలంటీర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండల పరిధిలోని 384 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను మండల పరిషత్ అధికారికి అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వలంటీర్లు ఎమ్మెల్సీ భరత్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ ఎలా పనిచేసిందో ప్రజలకు తెలుసన్నారు. ఈనెల వలంటీర్లు లేక పింఛన్‌దారులు పడిన అవస్థలు అందరు చూశారన్నారు. చంద్రబాబు కక్ష కట్టి వలంటీర్ల కడుపుకొట్టారని ఆరోపించారు. రాజీనామా చేసినా వలంటీర్లు భయపడాల్సిన పనిలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లపై నమ్మకం ఉంచారని, ఆ నమ్మకాన్ని రుజువు చేయాలని సూచించారు. జూన్‌లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మళ్లీ ఇదే వలంటీర్ల యథాతథంగా కొనసాగుతారని తెలిపారు. నాలుగేళ్లుగా ప్రతి ఇంటికి మీరు సాయం చేశారు. ఇప్పుడు మీరు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ప్రతి గడపకు వెళ్లి అడగాలని తెలిపారు. మళ్లీ జగనన్నను సీఎం చేసుకునేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరాలన్నారు. మండల కన్వీనర్ మురుగేస్, జెడ్పీటీసీ శరవణ పాల్గొన్నారు.

వలంటీర్ ఒక బ్రాండ్ ..



వలంటీర్ ఉద్యోగం కాదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాకిచ్చిన బ్రాండ్. నాలుగున్నర ఏళ్ల జీతం కోసం కాకుండా ప్రజలకు సేవ చేసేందుకు వచ్చాం. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరవేశాం. వలంటీర్లను తొలగించాలని ఫిర్యాదుచేశారు. ఇప్పుడు పింఛన్లుదారులు అవస్థలు పడుతుంటే ఆటోలు పెట్టడం, జూస్‌లు ఇచ్చి డ్రామాలు ఆడుతున్నారు. జగనన్న మాపై పెట్టిన నమ్మకాన్ని నిరూపించుకుంటాం. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా, భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపించడమే మా లక్ష్యం..

పుష్ప, వలంటీర్, జరుగు

వైఎస్సార్‌సీపీ నాయకురాలు నాగసుబ్బమ్మ మృతి


నాగసుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప


నాగసుబ్బమ్మ (ఫైల్)

- నివాళులర్పించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ నాగసుబ్బమ్మ(70) అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు వెళ్లి ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె సేవలను కొనియాడారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఉన్నారు.ఆమె అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు.

కారు, డీజిల్ ట్యాంకర్ ఢీ

- దంపతులకు తీవ్రగాయాలు

గంగవరం: కారు, డీజిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గంగవరం మండలంలో శనివారం జరిగింది. గంటావూరు బీసీ కాలనీకి చెందిన సర్ఫ్రాద్దీన్(54) ట్యాక్సీ డ్రైవర్. ఇతని భార్య సాజియాభాను(37). వీరిద్దరు శనివారం మదనపల్లిలోని ఆస్పత్రికి కారులో బయలుదేరారు. చికిత్స తీసుకుని మదనపల్లె నుంచి తిరిగి వెళుతుండగా కల్లుపల్లి బైపాస్ రోడ్డులో నూతన గ్రామ సచివాలయం వద్ద ఎదురుగా వస్తున్న డీజిల్ ట్యాంకర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న భార్యాభర్త ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల సమాచారం మేరకు గంగవరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టోర్‌లో అగ్నిప్రమాదం

చిత్తూరు కార్పొరేషన్: గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు కాల్చడంతో ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. టపాసులు కేబుల్స్ మీద పడడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. సంఘటనా స్థలాన్ని శనివారం పీఅండ్ఎం సీజీఎం చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు కాల్చడంతో సంఘటన జరిగిందన్నారు. రూ.15 లక్షల వరకు నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేశామన్నారు.

ఎస్పీఎం పనులు పూర్తి చేయండి


ఎస్పీఎం భవనాన్ని పరిశీలిస్తున్న సీజీఎం

చిత్తూరు కార్పొరేషన్: త్వరగా ఎస్పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం) పనులు పూర్తి చేయాలని ట్రాన్స్‌కో పీఅండ్ఎం సీజీఎం చలపతి తెలిపారు. శనివారం చిత్తూరులోని కేంద్రాన్ని పరిశీలించారు. పనుల పూర్తయ్యాయని ఇక తుదిదశలో ఉన్న ప్రహరీగోడ, ఫ్లోర్ నిర్మాణం పనులు చేయాల్సి ఉందని డీఈ ఆనంద్ తెలిపారు. ఈనెలలోపు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ భవనం మోడల్‌తోనే పులివెందులలో ఎస్పీఎంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో విద్యుత్ పరికరాలు తెప్పిస్తున్నామని తెలిపారు. అవసరమైన మెటీరియల్స్ స్టాక్ ఉందన్నారు. వేసవి కాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జీఎం జానకీరామ్, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు




కుప్పం: కమిషనర్‌కు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు, పుంగనూరు: కమిషనర్ నరసింహప్రసాద్‌కు రాజీనామా లేఖలను అందిస్తున్న వలంటీర్లు, పులిచెర్లలో..

కుప్పంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సామగుట్టపల్లి సచివాలయ పరిధిలోని 20 మంది వలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామాలకు పాల్పడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబు, వారి శ్రేణులు తమను పేదలకు సేవ చేయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ వలంటీర్ వ్యవస్థను హీనంగా చూస్తున్నారని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ రూపొందించిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంగా, భరత్‌ను కుప్పంలో ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు తామంతా ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖలను ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రహీమ్‌కు అందజేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని తాటిమాకులపాళెం సచివాలయం పరిధిలో 10 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. శనివారం రాజీనామా పత్రాలను వలంటీర్లు తేజావతి, స్వప్న, సుప్రియ, కీర్తన, శిల్ప, భారతి, మంజుల, భవాని, రిజ్వాన, గౌసియా కలిసి కమిషనర్ నరసింహప్రసాద్‌కు అందజేసి, రాజీనామాలను ఆమోదించాలని కోరారు. కమిషనర్ వాటిని ఆమోదించినట్లు తెలిపారు.


చౌడేపల్లి: ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

పలమనేరులో..

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు పాతపేట సచివాలయానికి చెందిన 12మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. తమ రాజీమానా పత్రాలను మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి అందజేశారు. అనంతరం వలంటీర్లు మాట్లాడుతూ తాము నాలుగన్నరేళ్లుగా ప్రజలకు సేవలందించామని తెలిపారు. ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా పార్టీలు చూడకుండా అర్హులైన వారికి పథకాలను అందించామని తెలిపారు. అయితే చంద్రబాబు కారణంగా తమకు జరిగిన అవమానంతో రాజీనామా చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సేవచేసే అవకాశాన్ని కల్పించిన జగనన్న కోసం ఇకపై అండగా ఉంటామని తెలిపారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ఆ వార్డు కౌన్సిలర్ రాజేష్ కొనియాడారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని కమ్మపల్లె పంచాయతీలో 9మంది వలంటీర్లు స్వచ్ఛందంగా తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణకు అందజేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి గెలుపు కోసం ప్రచారం చేస్తామని వారు తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు.

చౌడేపల్లిలో..

చౌడేపల్లె: మండలంలోని చౌడేపల్లె సచివాలయం-2, పందిళ్లపల్లె-పరికిదొన పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 31 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ కేవీ శివప్రసాద్ తెలిపారు. వలంటీర్లు మాట్లాడుతూ జగనన్న ఆశయాలకు అనుగుణంగా గత 55 నెలలుగా విధులు నిర్వహించామన్నారు. వలంటీర్లపై జరుగుతున్న కుట్రలు, దుష్ప్రచారానికి తట్టుకోలేక ప్రజాక్షేత్రంలో జగనన్నకు మద్దతు ఇవ్వాలని, మంత్రి పెద్దిరెడ్డి గెలుపునకు తమ వంతు బాధ్యతగా సైనికుల్లా పనిచేసి వలంటీర్ల సత్తా చాటుతామని పేర్కొన్నారు.